
## ఏదో తెలియని ఆవేదన

పుట్టిన మరునాడే అమ్మను పోగొట్టుకున్న
నన్ను నష్ట జాతకుడని అందరు అన్న
నాన్నే అన్నీ తానై నన్ను పెంచి
తాను రేయింబవళ్ళు కష్టపడి
తినకున్నా లేకున్నా నా కడుపునింపి
దొంగలు ఎత్తుకు పోనిది చదువని
ఉన్నత చదువులు చెప్పించి
నన్ను ప్రయోజకుడిని చేసిన
తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాలని
అనుకుని తాను చెప్పిన అమ్మాయిని
వివాహం చేసుకుని
నా కిచ్చిన బంగాళాకు తీసుకెళ్లినపుడు
నాన్న కళ్ళలో చూసిన ఆనందం
మరువకముందే
వచ్చినపని నెరవేరిందన్నట్లు
శ్రీరాముని దరిచేరిన పితృదేవుని
తలచుకుంటే ఇప్పటికీ ఏదో ఆవేదన...!!

కవిమిత్ర, సాహిత్యరత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి)
విశాఖపట్నం.




## మంచితనమే శత్రువా...!

మంచితనమే శత్రువా
ఏమో!
అనిపిస్తుంది నిజమేనేమో
వెంటనిలచి ముంచే వారిని చూసినప్పుడు
బ్రతుకును తుంచే వారిని చూసినప్పుడు.
మాటలతో
గారడి తో
గొప్పలతో
కలల అలలతో
ముంచుతూ
నిదానంగా
నిశ్శబ్దం గా
నిర్మొహమాటంగా
నిస్సందేహంగా
డబ్బులు హరిస్తూ
ప్రాణాలు తీస్తూ
వెన్నుపోటు పొడుస్తూ
వేదనకు గురిచేస్తూ
బాధలు పెడుతూ కూడా
హాస్యాస్పదంగా
అనాలోచితంగా
కుట్రపూరితంగా
కుతంత్రమే పరమావధిగా సాగే
మనుషులు ఉన్నంత కాలం
అనిపిస్తుంది
మంచితనము శత్రువే కదా అనీ.!

డా. యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.



## నా కలం

అల్లమంటుంది
అక్షరాలు
ముత్యాలసరాల్లా

పలకమంటుంది
పదాలు
చక్కని చిలుకల్లా

కాయించమంటుంది
వెన్నెల
పున్నమి జాబిలిలా

ప్రసరించమంటుంది
కిరణాలు
ఉదయిస్తున్న సూర్యుడిలా

చిందించమంటుంది
నవ్వులు
మోములు వెలిగేలా

చల్లమంటుంది
సౌరభాలు
మరుమల్లె పువ్వుల్లా

కురిపించమంటుంది
కవితలు
వానజల్లుల్లా

అలరించమంటుంది
అంతరంగాలలోతులు
నీలిగగనంలా

దోచుకోమంటుంది
హృదులను
రంగుల హరివిల్లులా

నిలిచిపొమ్మంటుంది
చిరకాలము
చరిత్రలో అమరుడిలా

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం



## నీ గుప్పెడు చప్పుడు బాధ తీర్చేదే నిజం ..!!



ఓ హృదయమా ..!
నిజాలు నీలో సేవాలను చేస్తూ అబద్ధాలను హాయిగా వాడేస్తున్నారు నిజమని నీపై ఒట్టేస్తూ
మనిషి మనిషిలోన నువ్వు ఉండడమే ఊపిరి
నీ ఊపిరి శాసలో వీచే గాలి అలలకు ఆలమటిస్తున్న
నిజాలు ఎన్నో నిలువెల్లా తనువెల్ల తెలుసు
నువ్వున్న ప్రతి మనిషికి ఓ హృదయమా ..!!

ఆశలు నిరాశల నిప్పుల్లో కాలిపోతూ
కన్నీటి దుఖాన్ని కలలు ఇష్టంగా తాగుతూ
ఊహల మైకంతో ఊపిరికి నిత్యం నీకు ఎన్ని పగ్గాలు పడుతున్నావో ఉరితాలుగా నీ హృదయానికి
అబద్ధపు ఆనందపు స్వతంత్రానికి నీలో నిజాలు
సమాధి చేస్తున్నారే స్వార్థంతో ఓ హృదయమా ..!!

బ్రతుకు బాధల బండరాళ్లు మోస్తూ
అలుపు లేని జీవిత పరుగు తీస్తూ
నిరంతరం నిలకడ లేని అనుక్షణం శ్రమిస్తావని
మరిచి మరిచి ఈ మనుషులలోకం
నిత్యం నీకు ఏదో ఒక గాయం చేస్తున్నారే కానీ
బతుకు బాధ బరువు దిగినట్టు
అలసిన తనువుకు హాయి గొలిపినట్టు
నిజాన్ని పలికి నీకు బాధను తగ్గించడం లేదు
ఈ మనుషులు ప్రాణం ప్రాణంగా నిలుపుతున్న
నీవు ఓ హృదయమా ..!!

మనిషి మరణం వరకు ప్రతిదీ మోసే దాసే
గుప్పెడంత గొప్ప గుండెచప్పుడువే నీవు ..!!

రచన చుంచు సంతోష్ కుమార్
గ్రామం : మద్రిముచ్చాల



## మనిషికో..నక్షత్రం.

మనిషికో..నక్షత్రం..
జన్మ నక్షత్రం కాదు
ఆకాశ వీధిలో తళుక్కున మెరిసే
తార..సుదూర తారా మండలం లో
మెరిసే..నక్షత్రాలు.


ధరణిలో ఏడు వందల కోట్ల
జనులు ఉంటే..
గెలాక్సీలో..కోటాను కోట్ల తారలు.

ఎన్నో లక్షల కాంతి దూరాలలో
మినుక్కున మెరిసే నక్షత్రాలు
కోట్లాది.. కంటికి కనిపించే తారలు
తామర తుంపరలు..ఇసుక రేణువులు.

గెలీలియో.. కు చిక్కిన తారలు కొన్నే.
హబుల్ నక్షత్ర పరిసోధనా కేంద్రానికి
చిక్కినవి..లెక్కకు మించిన తారకలు.
ఖగోళ శాస్త్రవేత్త..నామధేయం చేసినవి
లెక్కించదగినన్ని.. కొన్ని మాత్రమే.

జగాన ఉన్న..పోయిన వారందరి పేర్లు
అన్ని తారలకు పెట్టినా..ఇంకా కొంత
మిగిలే ఉంటుంది..ఉంటాయి కూడా.

మా నానమ్మ చెప్పింది..కాలం చేసిన వాళ్లు
విను వీధిలో.. నక్షత్రాలు గా మారి
మెరుస్తూ.. ఉంటారని..!




మా తాత ముత్తాతలు.. ఎన్నో
వేల సంవత్సరాల క్రితం..
నక్షత్ర మండలిలో సుదూర ప్రాంతంలో
ఇంకా..మిణుకు మినుకు మంటున్నారు.

సజీవంగా ఉన్న వాళ్లంతా..ఉజ్జల
కాంతితో..ప్రజ్వరిల్లుతున్నారు.

మనిషికో..నక్షత్ర నామాన్ని పెట్టే
ఆధునిక ' గెలీలియో ' పుట్టుకు
రావాలి..! మనమందరికో..పేరు
చొప్పున.. నామకరణం చేయాలి..!

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

## కవితే సంస్కృతి - స్పందనే జీవనపు స్ఫూర్తి




శ్వాస పుడమిలోకి వచ్చేది మనిషి ఆజ్ఞకు కాదు
గుండె తాళాలు మోగేది మనం చెబితే కాదు
తమదైన శక్తితో నడిచే శరీరమే ఈ జీవితం
అందుకే నడుస్తుంది... మనం లేకపోయినా సాగుతుంది.

కానీ మనిషి నడిపించే అహంకార రథాలు,
గర్వపు గదులలో బంధించబడిన ఈర్ష్య ద్వేషాలు
అవి జీవితాన్ని నిలిపేస్తాయి
ఆపే శ్వాసల కంటే ముందే ఆగిపోతాయి!

టెక్నాలజీ కేవలం వాడితే సరిపోదు
వాట్సాప్ బృందంలో కలిసిమెలిసి ఉండాలంటే
ఒక రచనను గౌరవించే హృదయం ఉండాలి.
ఒక చిన్న 'లైక్', ఒక చిన్ని 'కామెంట్'
రచయితకు అది కొత్త పంథా వైపు ప్రేరణ అవుతుంది!

కాలం లేదని చెప్పే ఓ గర్వం
"నేను బిజీ" అన్న మాటల వెనుక
మనసాక్షి శబ్దిస్తుంది నిజంగా కాదు అనిపిస్తుంది.
స్వరచనల్ని, సందేశాల్ని గౌరవించాలి,
అవి ఎవరి దినచర్యలోనో సమయం గెలిచిన భావాలే!

ప్రోత్సహించడమే సాహితీ సంస్కృతి
అది నిశ్శబ్దంగా సాగాల్సిన ఒక పరంపర
వాదనలు కాదు, వాగ్వాదాలు అసలేమీ కావు
బదులే కావలసినదైతే, అది స్పందనై ఉండాలి.


బృందంలో ఉండటం
ఒక మనసు కలవడం మాత్రమే కాదు
ఒక భావం, ఒక తత్వాన్ని పంచుకోవడమూ కావాలి.
ఎవరు తమ రచనలు పంపినా, వారు వ్యర్థంగా కాదు
మీ ఊహల మద్దతు కోసం ఎదురు చూస్తూ ఉంటారు!

కళాకారుని రచనకు స్పందన ఇవ్వడం
ఒక మర్యాద ఒక ప్రేరణ ఒక మానవతా సందేశం.
అందుకే, మనం అందరం కలసి
ఇలాంటి బృందాలను ప్రేరణతో నడిపించాలి
సజీవతనిచ్చే చర్చలతో మన భావాలను
నిమిషాలవుతూ నిలపాలి.

-రామడుగు వేణుగోపాల్
దోహా , ఖతార్ ( మంథని )



## డబ్బు బంధం దరిద్రం




ధనంతో ముడివడిన బంధం
అశ్వాశ్విత మైన అనుబంధం
కాణి లేకుంటే కుదరనిచందం
కనువిప్పు కలిగే కలుషితం!

రూపాయితో కలిసేస్నేహం
ఎప్పటికప్పుడు కొత్తదనం
నిర్దాక్షణ్యంగా విడిపోవటం
నిలువెత్తు పరువుతీయటం!

డబ్బులు ఎవడికి చేదంటు
దండోరా వేసేను బంధము
నీతి నిజాయతి మర్మము
వీసమెత్తు చూడని కర్మము!

రూకలుంటే విలువపెంచు
మోసమును తెలివిగుంచు
ఆదమరిస్తే అంతా ద్రోహమే
చివరికంతా చేదు నిజమే!

ధనంతో కలిసే స్నేహము
ధరిద్రానికి ఓ సంకేతము
నిజాయతీకి పెను ద్రోహము
నిప్పుతో తల గోక్కోవటమే!

డా.ప్రసాదు యంవివి(సాదు)
కల్లూరు, ఖమ్మం జిల్లా.

## కవిత్వం రాయాలనే తపన ఉంటే

కవిత్వం రాయటం అనేది
మనిషి మేదస్సును బట్టి ఉంటుంది

వారి సామాజిక స్పృహన్ని బట్టి.
వారి ఆలోచన బట్టి ఉంటుంది

మేధావుల పుస్తకాలు చదవటం
మేధావులు మీటింగ్లకు హాజరవటం

మొదలగునవి చేస్తుంటే
మనిషిలో రాయాలనే తపన ఉంటే

తప్పనిసరిగా కవిత్వం రాయగలరు
మీరు కవిత్వం రాస్తారు కూడా

మీరు రాస్తున్న కొద్ది
మీ ఆలోచనపెరుగుతూనే ఉంటుంది

మీరు చదివేటప్పుడు రాసేటప్పుడు
కొత్త కొత్త పదాలను గమనించండి

కవిత్వానికి పద పొందిక అవసరం
పొందిక లేకుంటే కవితలోపసఉండదు

మనము రాసే కవిత్వం
సామాజిక స్పృహ కలిగి ఉండాలి

మనం రాసే కవిత్వం
అవినీతినీ ఖండించేలా ఉండాలి

అవినీతిని ప్రోత్సహించేదిగా
కవిత్వం మనం రాయకూడదు

మనం రాసే కవిత్వం లో
తప్పులు ఎత్తిచూపేలా ఉండాలి

ప్రేమ కవిత్వాలు కాదు
సమాజ అభ్యుదయం ముఖ్యం

మనం రాసే కవిత్వములో
భావం అర్థమయ్యేలా ఉండాలి

అర్థం కాని కవిత
వ్యర్థమని మీరు గ్రహించండి



మీరు కూడా కవిత్వం రాయండి
సమాజాభివృద్ధికి చేయూతనివ్వండి

రచన సౌపాటి ప్రభాకర్
సాహితీ రత్న/ నంది అవార్డ్ గ్రహీత
చరవాణి 81 84 97 44 60

## స్నేహం,,,,,,,,!!

స్నేహభావం ఎంతో మధురమైనది
కాని రకరకాల వైరుధ్యాల నేటి సమాజంలో
మనిషి తను కష్టపడి కుటుంబాన్ని పోషించే క్రమంలో
తను అనుభవించే జీవిత ఆటుపోట్లలో
సహజంగానే తన తోటివారితో స్నేహభావం పెల్లుబుకుతుంది
తన భావాలు అనుభూతుల కనుగుణమైన స్నేహితున్ని ఎంచుకుంటాడు
నిజానికి నేటి కుళ్ళిపోయిన సామాజిక సంబంధాలలో
నిజమైన స్నేహితులు దొరకడం కష్టం!
తమ కష్టసుఖాలను ఒకరికొకరు వల్లెవేసుకోవడానికే స్నేహం
ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునే ధోరణి అంతా ఆర్థిక సంబంధాలే!
తను కష్టాల్లో ఉన్నపుడు కంటితుడుపు చర్యే స్నేహమయ్యింది
తరువాత ఎవరికి వారే యమునా తీరే
ఆత్మీయ స్నేహితులు అరుదు,,,,,,!
మానవ సంబంధాలు యాంత్రికమై పోయాయ్
జీవితాంతం తోడునీడగా ఉండే స్నేహితులు కానరారు
స్నేహం పేరుతో తీయని మాటలు చెప్పి గోతులు తీసేవారు కొందరైతే
తామరాకుపై నీటి బిందువుల్లా అంటీ అంటని స్నేహితులు కొందరు
స్నేహితుడంటే తనకోసమే జన్మించాడా అన్నట్లుండాలి!
తను నిప్పులు మింగుతున్నా
స్నేహితుడన్న వాడితో పంచుకోలేని పరిస్థితి!
ఎవరి స్వార్థం వారిది అన్నప్పుడు
నామమాత్రపు స్నేహాలే ఏర్పడుతాయి!
ఈ ఆర్థిక యాంత్రిక సమాజంలో నిజమైన ఆత్మీయ స్నేహాలు కరువు!!

అపరాజిత్
సూర్యాపేట

